


## కౌకాని కమల

"జిర్....జర్...." మని బయట అదేపనిగా కాలింగ్ బెల్ మోగిస్తున్నారెవరో.

లేచి వెళ్ళి తలుపు తియ్యాలనే విసుగుతో 'ఈ రంగయ్య ఎక్కడ చచ్చాడో!' అనుకుంటూ సోఫాలో పడుకున్న విమల విసుగ్గా కదిలింది. పైన గిరగిరా తిరుగుతున్న ఫాన్ గాలికి చేతిలోని పుస్తకంలోని కాగితాలు రెపరెపలాడాయి.

"విమలా....విమలా...." అంటూ అదే పనిగా తలుపు తట్టిన శబ్దం అయింది.

చిరాగ్గా లేచి టీపాయి మీద పుస్తకం విసిరి వచ్చి తలుపు తీసింది విమల.

ఎదురుగా సుశీల! చెమటలు దిగ్గారి పోతున్నాయి. రోహిణీ కార్తె ఎండలు! గాడ్పు ఈ చెవి నుంచి ఆ చెవికి నాగుపాము బుసల్లా వినవస్తున్నది. 'అంత ఎండలో సుశీల వచ్చింది! ఎలా వచ్చిందో ఏమో! ఆమె ఓర్పుకి చెప్పుకోవాలి!' అనుకుంది విమల.

సుశీల ఒళ్ళంతా చెమటతో తడిసిపోయి వుంది. మొఖం కందగడ్డలాగ ఎరుపుకి తేలింది. వడిలిన తోటకూర కాడలా వున్న సుశీలని చూస్తూనే ఆశ్చర్యపోయింది విమల!

"ఇందాకట్నుంచి తలుపు తడుతున్నది నువ్వా? ఇంకా ఎవరో అనుకున్నానే!" అంటూ లోపలికి నడిచింది.



ఇంటి చుట్టూ
బూగన్‌విలియా పెంచండి!

ఇంటినీ, కన్నుల పండువగా
చెయ్యండి!

మీ ఇంట్లో బూగన్‌విలియా
పెంచాలని వుందా?

**'బూగన్‌విలియా'**
అన్న ఆంగ్ల పుస్తకం చదవండి!




రచయిత
బి. ఎ. రామారావు

బూగన్‌విలియాలోని రకాలు,
వాటిని పెంచే విధానాలు
అన్నీ వివరంగా గల 52 పేజీల పుస్తకం.

అట్టమీద, లోపల ఆర్ట్ పేపర్ మీద
వర్ణచిత్రాలు
వెల: రూ 12. లు

ప్రతులు కావలసిన వారు:
బి. ఎ. రామారావు
'లలితా నిలయం' 53 ఎ, క్రిసెంట్ ఎవెన్యూ
కె. పి. పురం, మద్రాసు 600 028.
అన్న చిరునామాకు వ్రాయండి.

సుశీల వచ్చి సోఫాలో కూర్చుంది. ఫాన్ వేసింది విమల.

"అబ్బ! ఏం ఎండలే విమలా! బయట కాలు పెట్టలేకుండా వున్నాము!" అంటూ చేతినున్న హ్యాండ్ బ్యాగ్ ప్రక్కనే వుంచి నుదురంతా రుమాలుతో అద్దుకుంది. "పడుకున్నావా? నిన్ను డిస్టర్బ్ చేసినట్లున్నాను" అన్నది సుశీల నొచ్చుకుంటూ.

"నీ మొహం! ఇంత ఎండలో వచ్చింది కాక నన్ను డిస్టర్బ్ చెయ్యటమేమిటి?" అంటూ "రంగయ్యా!" అని కేక పెట్టింది విమల.

"అమ్మగారూ..." అంటూ హడావుడిగా లోపల్నుంచి పరుగెత్తుకుని వచ్చాడు రంగయ్య.

"ఏం చేస్తున్నావ్ లోపల?"

"పెరట్లో పంపు పాడయింది కదండీ! బాగు చేయిస్తున్నాను."

"సర్లేగాని తాగటానికేమయినా తీసుకురా...." అని "ఏమిటి సుశీ! సంగతి చెప్పు" అన్నది మిత్రురాలివైపు చూస్తూ.

"చెప్పటానికేముంది?" అని తలవంచుకుంది సుశీల. "ఎక్స్క్యూజ్ మి విమలా! ఓ యాభై రూపాయిలు వుంటే సర్దగలవా?" అన్నది తప్పు చేస్తున్నదానిలా.

అటువంటి అవసరం ఏదో వుంటుందని ముందే వూహించింది విమల. రెప్ప వాల్చకుండా ఒక్కక్షణం మిత్రురాలివైపు చూసి.

"సారీ! లేవు" అంది నిర్లిప్తంగా. కాని చీరకోసం అని దాచిన 200 రూపాయలు ఆమెకి ఆ క్షణంలో గుర్తొచ్చాయి.

రెండు గ్లాసులతో ఐసువాటరూ, రెండు కూల్ డ్రింక్ సీసాలు తెచ్చి టీపాయి మీద పెట్టాడు రంగయ్య.

"తీసుకో సుశీ!"

"ఎందుకే ఇప్పుడివన్నీ? నే వెడతాను. నీ దగ్గర లేకపోతే జయని అడుగుదామనుకుని బయలుదేరాను" అన్నది సుశీల ఇబ్బందిగా.

"................"

విమల కళ్ళెత్తి సూటిగా స్నేహితురాలి కేసి చూసింది: "అది సరే! ముందిది చెప్పు. ఆ యాభై రూపాయిలు అంత అవసరమా?"

దీనంగా తలెత్తింది సుశీల. "లేకపోతే ఇంత అభిమానం చంపుకుని ఎందుకు వస్తానే! ఇప్పటికి నీ దగ్గర ఇలా చీటికి మాటికి బదులు తీసుకోవటం ఎన్నిసార్లో ...!"

"దాందేముందిలే....మళ్ళీ ఇచ్చేస్తున్నావుగా?"

"అయితే మాత్రం? అడగటానికయినా ఓ హద్దు వుండద్దా? ఏమిటో....నన్ను తల్చుకుంటే నాకే అసహ్యం వేస్తుంది ఒకోసారి" అంది సుశీల బాధగా తల వంచుకుని. అట్లా అంటుంటే ఆమె కళ్ళల్లో పల్చగా కమ్మిన నీటిపొర తళతళా మెరిసింది!

తన చేతిని నెమ్మదిగా ఆమె భుజం మీద వేసింది విమల.

"సుశీ! మొదట్నుంచి మనిద్దరం మంచి స్నేహితులం. మన మధ్య అట్లాంటి ఫీలింగ్సు వుండటం నాకిష్టం లేదు. ఇంతకీ అసలు సంగతి చెప్పు."

"చెప్పటానికేముంది విమలా? మా రెండో ఆడపడుచు వచ్చి ఇరవై రోజులైంది కదా! రేపు ఆవిడ వెళ్ళిపోతున్నది. ఆవిడకి, పిల్లలకి బట్టలు పెట్టాలి. నా దగ్గర కొంత డబ్బు వుందనుకో...." అంటూ నసిగింది సుశీల.

ఆ మాటలు విని చురచురా చూసింది విమల: "హు .... నేను అప్పుడే అనుకున్నాను. నీ కిటువంటి అవసరమే ఏదో పడిందని. ఏం? అంత అప్పుచేసి మీ ఆడపడుచుకి చీర కొనక పోతే వచ్చిన నష్టమేమిటో! తరచూ వస్తూనే వుంటుంది కదా! పెళ్ళయి నలుగురు పిల్లల తల్లికి ఇంకా ఈ మర్యాదలేమిటి?"

"నీకు తెలియదు విమలా! ఆవిడ మాట ఎలా వున్నా అసలు మా అత్తగారు వూరుకోరు."

"ఆవిడ వూరుకునేదేమిటే! నీ దగ్గర లేనప్పుడు ఎక్కడ్నుంచి తెస్తావ్?" అంది కోపంగా విమల.

"ఏదో లేవే! మా బ్రతుకులు ఇట్లా అప్పుల్తో, దారిద్ర్యంతో వెళ్ళిపోవాల్సిందే. ఆయన పట్టించుకోరు, ఇక నా కివన్నీ తప్పవు. జయని అడిగి చూస్తా! వస్తానే...." అంటూ లేచింది.

విమల తీవ్రంగా చూస్తూ అన్నది: "అయితే నేను ఇవ్వకపోతే జయని అయినా నీవు అడుగుతావు గాని, ఆ ఖర్చు మాత్రం మానుకోవు. అంతేగా?"

"ఏం చెయ్యమంటావే విమ్మీ! నాకు మాత్రం ఇలా అప్పుల్లో మునిగి తేలటం సరదా అను

కున్నావా? వాళ్ళకి ఏమన్నా తక్కువ చేస్తే మా అత్తగారు అనే మాటలు వినలేం. ఆ మాటలు విన్నాక ఆ యింట్లో మంచినీళ్ళు కూడా తాగ బుద్ధి కాదు" అంది సుశీల వేదనగా తలపట్టుకుని.

"హం..హాయిగా ఉద్యోగం చేసుకుంటున్నావ్! నీకేమిటి! నీ యిష్టం వచ్చినట్లు నువు వుండవచ్చు వాళ్ళకి భయపడేదేమిటి? అయినా మీ ఆయనకి లేని బాధ్యత నీ కెందుకు? వాళ్ళు నీకు చెల్లెళ్ళా? మీ ఆయనకి చెల్లెళ్ళా?"

నవ్వుతూ చూసింది సుశీల: "ఆయనకి చెల్లెళ్ళు. నాకు అంతకన్నా ఎక్కువే! సరా?"

"అవును. అందుకే నిన్ను ఇంతగా ఏడిపించటం—కదూ?"

"నిజమే విమలా! కాని ఏం చేస్తాం? మనకి స్తోమతవున్నా లేకపోయినా కొన్ని ఆచారాలని పాటించక తప్పదేమో విమలా! నే వెడతానే.... చాలా పనులున్నాయి" అంటూ లేచి బ్యాగు అందుకుంది.

వచ్చే నిట్టూర్పుని ఆపుకుంటూ "ఉండు" అంది విమల. లేచి లోపలికి వెళ్ళి బీరువా తెరచి ఐదు పదులు లెక్కపెట్టి తెచ్చి సుశీలకి అందించింది.

"చూడు! ఈసారి గనుక ఇస్తున్నాను. కాని ఇకముందు మీ అత్తగారికో, ఆడపడుచుకో చీరలు—సారెలూ పెట్టటం కోసం మాత్రం నన్ను అప్పు అడగకు. తెలిసిందా? బాగా జ్ఞాపకం పెట్టుకో. తీరా నువ్వు అడిగాక నేను ఇవ్వకుండా వుండలేను. కాని ఇటువంటి అవసరాలకి ఇవ్వాలంటే నాకు పరమ అసహ్యం" అంది విమల నోట్లు సుశీల చేతిలో వుంచుతూ.

సన్నగా విరిసీవిరియని పెదవులతో నవ్వి డబ్బు తీసుకుంది సుశీల.

"ఛీ....సిగ్గులేదు? నవ్వటానికి" అంటూ ఆమె జబ్బమీద గిచ్చింది విమల. విమల గిచ్చిన చోట చేత్తో రాచుకుంటూ గుమ్మం దాటింది సుశీల!

"ఈ ఎండలో నడచి వెడితే చచ్చిపోతావ్! రిక్షాలో వెళ్ళు" అని హెచ్చరించింది విమల.

*

సుశీల హైస్కూలు టీచరు. ముగ్గురు పిల్లల తల్లి! భర్త కూడా మంచి ఉద్యోగమే చేస్తున్నాడు కాని ఏమి పట్టించుకోడు. నెలనెలా తన జీతం 150 రూపాయలు ఇంట్లో ఇస్తాడు. మిగతా 200 పైచిలుకు అతడు తన సొంత ఖర్చులకే వినియోగించుకుంటాడు. బాగా జల్సారాయుడు. ఇంక ఇంటి బాధ్యత అంతా సుశీలదే!

పోనీ పెద్దదిక్కుగా ఆ అత్తగారు వుందంటే కలిసిరాదు—చుంచు గుణం! కొడుకునే సమర్థించి కోడల్ని దుయ్యబడుతుంది.

సుశీలకి నలుగురు ఆడపడుచులు వున్నారు. ఆఖరి అమ్మాయి, ఆ తరువాతి ఇద్దరు మగపిల్లలు చదువుకుంటున్నారు. పై ముగ్గురు ఆడపిల్లలు తరచూ పుట్టింటికి పిల్లల్తో వస్తూనే వుంటారు. వాళ్ళకి వచ్చినప్పుడల్లా చీరాసారె పెట్టాలంటుంది అత్త. తండ్రి లేని లోటు వాళ్ళకి కనుపించకూడదని ఆవిడ అభిప్రాయం. కాగా ఏ స్టీలు గిన్నెలనో, మిల్క్ బాయిలర్ నో తల్లిని కొనియ్యమని వాళ్ళు గారాలు గుడుస్తారు. "ఎంత ఉద్యోగం చేస్తేమాత్రం కోడలైనా ఎక్కడ్నుంచి తెస్తుంది?" అన్న ఆలోచన ఆ అత్తగారికి లేదు. కొడుకుని అడిగి లాభం లేదు. "ఏమో! నా జీతం అప్పుడే ఇంట్లో ఇచ్చాను. ఇంక నాదగ్గిరెక్కడిదీ" అని వెళ్ళిపోతాడు. ఇంక సుశీల అప్పో, సప్పో చేసి అవసరం గడపాల్సిందే!

సుశీల చాలా మెతక మనిషి. వాళ్ళని ఎదిరించదు. నోరులేని మూగ మొద్దులా పడుతుంది. కష్టమో సుఖమో వాళ్ళని తృప్తిపరుస్తానంటుంది. కాని మంగళగిరి పానకాలస్వామి దాహంలాంటిది వాళ్ళ దాహం! ఇట్లాంటి అర్థం లేని ఖర్చుల మధ్య, బాధ్యతలతో నలిగిపోతున్న సుశీల! ఇంకా ఆమె పిల్లలు సరదాలు అంటూ ఖర్చులు వుండనే వున్నాయి. ఉద్యోగం చేస్తున్నా ఎంచదగ్గ మంచి చీర లేదు సుశీలకి! కాని ఆమె భర్త వెంకట్రావు మాత్రం వీటన్నింటికి అతీతుడు!

"ఆడపడుచులు వస్తే ఇంత తిండిపెట్టి పంపించు. ఈ రోజుల్లో అదే ఎక్కువ! మిగతా వన్నీ మానుకో...." అని హితవు చెప్తుంది విమల.

కాని సుశీకి అది చేతకావటం లేదు. ఎదిరించి నెగ్గలేనంటుంది. "రోజంతా నా పిల్లలు ముగ్గుర్ని వాళ్ళమీద వదిలిపెట్టి వెళ్ళాలి. ఆవిడ నా మీది కోపం ఆ పసివాళ్ళ మీద చూపిస్తే వాళ్ళ గతేమిటి?" అని ఆమె భయం! 'నిజమే మరి....' దీర్ఘంగా నిట్టూర్చింది విమల.

"ఏమిటో! దాని జీవితం ఓ సుడిగుండంలో చిక్కుకుంది. సుశీల చదువుకున్నా బ్రతుకుతెరువు తెలియనిది" అన్న అనుమానం విమలని విడవటం లేదు.

'ఆ యాతనలన్నీ పడుతూ ఆఘెగనక వుంది గాని, అదే తనయితే ఈపాటికి పారిపోయి వుండేది. రాజా లాంటి ఉద్యోగం చేస్తూ తొత్తు లాగ పడివుండే ఖర్మేమిటి?' అన్న అభిప్రాయం విమలది.

గడియారం నాలుగు గంటలు కొట్టింది.

ఆలోచనలనుంచి తేరుకుంది విమల. నెమ్మదిగా లేచి భర్త హాస్పిటల్ కి ఫోన్ చేసింది.

"హలో...." అవతల్నుంచి శ్రీనివాస్ పలికాడు.

"నేనే విమల్ని! సాయంత్రం సినిమాకి వెడదామన్నారు. గుర్తుందా?"

"మర్చిపోవటమా? తప్పకుండా 5—30 గంటలకి వస్తా. రెడిగా వుండు" అన్నాడు నవ్వుతూ.

"అలాగే! ఏంచేస్తున్నారు—బిజీగావున్నారా?"

"లేదు విమ్మీ! పేషంట్లూ ఎక్కువ లేరు. నువ్వేం చేస్తున్నావ్? టిఫిన్ తిన్నావా?"

"ఉహూ....మీరు వచ్చాక ఇద్దరం కలిసే తిందాం. రంగన్న పూతప్పం చేస్తున్నాడు."

"అచ్ఛా...."

నవ్వుతూ ఫోన్ పెట్టేసింది విమల.

*

ఐదూ, ఆరూ, ఏడు! పైగా అరగంట కూడా దాటింది! శ్రీనివాస్ జాడ లేదు!

చూసి చూసి విసుగుపుట్టిన విమల చీర కూడా మార్చుకోకుండా అసహనంగా మంచం మీద వాలింది.

"ఛీ....ఈ డాక్టర్లని పెళ్ళిచేసుకున్నంత బుద్ధి తక్కువ ఇంకోటిలేదు" అనుకుంది విమల అసహనంగా. ఎదురుగా అందంగా వున్న ఫ్లవర్ వాజ్ కనిపిస్తే అందులోని పూలగుత్తి పీకి కసిగా నేల కేసి కొట్టింది.

అట్లా ఏరికోరి 'డాక్టరు అల్లుణ్ణి' వెదికి వెదికి తెచ్చిన తండ్రిని, గంగిరెద్దులా తలాడించిన తన తెలివితక్కువని విమల తిట్టుకోని రోజులు చాలా అరుదు.

డబ్బుకి లోటు లేకపోయినా ఏ సరదాలు తీరటం లేదు విమలకి! శ్రీనివాస్ కి విమలంటే వల్లమాలిన ప్రేమ! కాని హాస్పిటల్ గేటు దాటితేనేగాని ఆమె గుర్తురాదు.

"ఏం చెయ్యమంటావ్? రోగుల్ని వదిలి ఎలా రాను చెప్పు? బాధ్యతలు విమ్మీ!"

ఓ సాయంకాలం భర్త ఆఫీసు నుంచి వచ్చాడు—మామూలుగానే ఇస్సురోమంటూ. రాగానే భార్య అతన్ని కూర్చోమని కుర్చీ వేసి, పైన ఫాన్ తిప్పింది. బూట్లు ఊడ దీసింది. టిఫినూ, కాఫీ అందించింది. "ఇవాళ కాఫీ బావుంది కదూ!" అంది-అంత ముఖం చేసుకుని. "సరే, ఈ మర్యాదలు ఇహ చాలు గాని. నువ్వు కొన్న కొత్త చీరె చూపించు మరి చూదాం" అన్నాడు కూల్‌గానూ, కూలబడుతూనూ ఆ భర్త.

అంటాడు శ్రీనివాస్ అనునయంగా.

"అవును. భార్యని సంతోషపెట్టటం డాక్టర్ల బాధ్యత కాదు. ఊళ్ళోని రోగులందరికి చికిత్స చేసి, చివరికి భార్యని రోగిష్టిగా తయారు చెయ్యటం మీకే చెల్లు" అంటుంది కోపంగా విమల.

"నువు చదువుకున్నదానివి. ఆలోచించి పరిస్థితుల్ని అర్థంచేసుకోగల నేర్పు వుంది. నేను నీకేం చెప్పగల్ను?"- అది అతని జవాబు!

తల పట్టుకుంది విమల!

"అమ్మగారూ! అయ్యగారు ఎప్పుడు వస్తారో ఏమో! మీరు టిఫిన్ చెయ్యండమ్మా" అంటూ వచ్చాడు రంగన్న.

ఒక్కక్షణం ఆలోచించి లేచింది విమల. "అలాగే-పద" అంటూ డైనింగ్ హాలు వైపు నడిచింది విమల.

టిఫిన్ పూర్తిచేసి "రంగయ్యా! నాకు బాగా నిద్దరవస్తోంది గాని, అయ్యగారు వస్తే నువు చూసుకుంటావుగా....?"

"అలాగే అమ్మగారూ!"

విమల లేచి, పైకి వెళ్ళి చీర మార్చుకుని మంచం మీద వాలింది. ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్రపట్టిందో ఆమెకు తెలియనే తెలియదు!

*

విమలకి మెలకువ వచ్చి నెమ్మదిగా కళ్ళు విప్పేసరికి గదిలో లైటు వెలుగుతున్నది. టేబుల్ గడియారం 11 గంటలు సూచిస్తున్నది.

"అబ్బా! ఇంతసేపు నిద్రపొయ్యానా?" అనుకుంటూ నెమ్మదిగా ఇవతలికి వచ్చింది. ప్రక్క గదిలో లైటు వెలుగుతున్నది. ఓరగా చేరవేసి వున్న తలుపుని కొద్దిగా తీసింది.

నైట్ డ్రస్‌లో వున్న శ్రీనివాస్ కుర్చీలో వెనక్కి వాలి వున్నాడు. కాళ్ళు బార చాచి ఎదురుగా వున్న టేబుల్ మీద పెట్టుకున్నాడు. ప్రక్కనే గాజు గ్లాసులూ, బాటిల్!

అప్పటికే రెండు మూడు రౌండ్సు అయినట్లున్నాయి. మనిషి బాగా తూలుతున్నాడు. చేతిలోని సిగరెట్ అగ్నిశిఖలాగ వెలుగుతోంది.

అందరికీ నీతులు చెప్పే డాక్టరు తాగుతున్నాడు. శ్రీనివాస్‌లోని గొప్ప బలహీనత అది! 'ప్రెస్టిజ్' కోసం అలవాటు చేసుకున్న ఆ తాగుడు ఇప్పుడు అతణ్ణి వదలలేనంతగా పట్టుకుపోయింది! రోజూ రాత్రి పూట కొస్త పుచ్చుకుంటేగాని నిద్రపట్టదు. మాన్పించుదామని ఎంతో ప్రయత్నించింది విమల. కాని లాభం లేకపోయింది.

అతను అట్లా త్రాగటం విమలకి ఇష్టంలేదు.

విరాళగా తలుపుకి జార్లపడింది విమల! చప్పుడుకి తలెత్తాడు.

ఎదురుగా భార్య! విమల రూపం మసక మసకగా కనిపించింది.

"ఓ....రా....విమ్మీ! నేనే వద్దా....మనుకుంటున్నాను." అంటూ లేచి నిల్చున్నాడు. కుర్చీ శబ్దంచేస్తూ వెనక్కి జరిగింది. గాజు గ్లాసులు ఒకదానికొకటి తాకి శబ్దంచేస్తూ కింద పడ్డాయి.

"ఓ....వాట్ ఎ న్యూసెన్సు...." అనుకుంటూ వంగి పగిలిన పెంకులు ఏరబోయి మళ్ళీ తూలి పడబొయ్యాడు అతను.

పరుగున వచ్చి చప్పున ఆతణ్ణి పట్టుకుంది విమల. క్షణంలో అతని కాలికి దిగవలసిన గాజు ముక్కని ఏరి పారేసింది.

"విమ్మీ! పాపం నాకోసం చాలాసేపు ఎదురు చూశావటగా! ఏదీ....ఆ రింటికే వద్దామనుకున్నాను! పేషంట్లు....అబ్బబ్బ! ఎక్కడలేని రోగాలు వీళ్ళకే? ఓ పట్టాన వదిలితేనా? చెప్పు...." అంటూ ఆ మైకంలో మాటలు సాగదీస్తూ సంజాయిషీ ఇస్తున్నాడు శ్రీనివాస్. ఆమె భుజాల చుట్టూ చేతులువేసి దాదాపు బరువంతా ఆమెమీద వేశాడు.

తన రెండు చేతులూ ఆసరా ఇచ్చి భర్తను నెమ్మదిగా బెడ్ దగ్గరికి నడిపించుకుని వెళ్ళి పరుండచేసింది విమల. బ్లాంకెట్ తీసి కప్పింది.

చెయ్యిచాచి ఆమె కొంగుని పట్టుకున్నాడు శ్రీనివాస్.

"మళ్ళీ ఎక్కడికి విమ్మీ!"—

"తలుపువేసి వస్తా!"

తలుపువేసి, లైటార్పి బెడ్ లైటు వేసింది విమల.

దరికిచేరిన విమలని రెండు చేతులా చుట్టి కదలనివ్వకుండా బంధించాడు శ్రీనివాస్.

అట్లా భార్యతో కబుర్లు చెప్పి, చెప్పి మరో అరగంటకల్లా గాఢ సుషుప్తిలోకి జారిపొయ్యాడు.

కాని విమలకి నిద్ర పట్టలేదు. కళ్ళు విప్పుకుని అలాగే చూస్తూ వుండిపోయింది.

గడియారం 12, 1 గంట కొట్టడం కూడా విన్నది. ఆ తరువాత అరగంట కొట్టకుండానే మెల్లగా మగత నిద్రలోకి ఒరుగుతున్న విమలకి మళ్ళీ కాలింగ్‌బెల్ మ్రోగటం వినిపించింది.

ఆ వచ్చింది ఎవరోగాని అదేపనిగా బజ్జర్ మ్రోగిస్తున్నారు. హడావుడిగా తలుపుకూడా తడుతున్నారు.

"అబ్బబ్బ! ఈ అర్ధరాత్రి ఎవరో........" అనుకుంటూ విసుగ్గా లేచి తలుపు తీసింది విమల. ఎదురుగా రాములు! మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు.

"రాములూ! నువ్వా? ఏమిటి?"

"నేనేనమ్మగారూ! అయ్యగార్ని ఒక్కసారి నాతో తీసుకుని వెడదామని వచ్చాను. మా ఆడదానికి ప్రాణం మీదికి వచ్చిందండి. అయ్యగార్ని ఇంతరాత్రి లేపటం మంచిపని కాదు. కాని ఏం చెయ్యనండీ? ఒక్కసారి డాక్టరుబాబుగార్ని లేపండి........" అంటూ అమాంతం విమల కాళ్ళ మీద పడిపోయాడు.

రాములు చాలా రోజుల్నుంచి తెలుసున్న

మనిషి. కొన్నాళ్ళు శ్రీనివాస్‌కి కారు డ్రైవరుగా కూడా పనిచేశాడు. నమ్మకమైనవాడు. వాళ్ళ ఇంట్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా శ్రీనివాస్ ఆదుకుంటాడు. అతని భార్యకి పురుడు అయితే పాత చీరలు అవీ పంపిస్తుంది విమల. నమ్మకంగా ఇంటి మనిషి లాగే వుంటాడు రాములు. రాములు దగ్గర పెద్దగా ఫీజు విషయం కూడా పట్టించుకోడు శ్రీనివాస్. అతను ఎంత ఇస్తే అంత, ఎప్పుడు ఇస్తే అప్పుడు తీసుకుంటాడు.

నిజమే! అలాంటి రాములుకి అవసరం వచ్చింది. కాని విమలకి ఎటూ పాలు బోలేదు.

రాములు ఏడుపొక్కటే తరువాయిగా నిల్చున్నాడు! అవతల అతని భార్యకి ఎంత ప్రమాదంగా వుందో ఏమిటో....!

"దానికేదన్నా అయితే నా పిల్లలు అన్యాయం అయిపోతారమ్మగారూ!...నాకు మీరే దిక్కు...." అంటూ రెండు చేతులూ జోడించి కళ్ళు మూసుకున్నాడు. కన్నీరు జలజలా రాలిపడ్డాయి.

నిస్తేజంగా చూస్తూ నిల్చుండి పోయింది విమల! శ్రీనివాస్ ఇప్పుడు లేచి వెళ్ళే స్థితిలో లేడు. లేపితే లేచి వెళ్ళినా సరిగా ట్రీట్‌మెంటు ఇస్తాడో ఇయ్యడో! తన్నుతాను కంట్రోల్ చేసుకోలేని మనిషికి ఇతరుల పరిస్థితి అర్థం కావటం కొంచం కష్టమే!

"అమ్మా! డాక్టరుబాబుగార్ని లేపండి...."

"రాములూ! లేపటానికేం లేదు. ఆయన వూరికి వెళ్ళారు. రేపు ఉదయం కాని రారు...."

"అమ్మా...." అని అరిచాడు. అది అరుపు కాదు. ఆర్తనాదం లాగ వినిపించింది విమలకి.

"అవును రాములూ...." రాములు నెత్తి బాదుకున్నాడు. "అయ్యో! అమ్మగారూ! దానికి చావే రాశాడేమో దేముడు! నా దగ్గర డబ్బు కూడా లేదు అమ్మగారూ! బాబుగారి మీదే ఆశ పెట్టుకుని వచ్చాను...." అని లబోదిబోమంటూ వెనుతిరిగాడు.

విమలకి మనస్సంతా కలతబారిపోయింది.

"రాములూ....ఆగు!" అంటూ త్వరత్వరగా లోపలికి వెళ్ళి ఓ 50 రూపాయలు తెచ్చి అతని చేతిలో పెట్టింది.

"ఇదిగో....ఈ డబ్బు వుంచు. తరువాత చూసుకోవచ్చు. ఈ సందుచివర డాక్టర్ శేఖర్ గారు వున్నారు చూడు. ఆయన దగ్గరికి వెళ్ళు. మీ ఆవిడకేం ఫరవాలేదు. నేను ఈ లోగా ఆయనకి ఫోన్ చేసి చెప్తాను" అంది.

"అలాగే....అమ్మగారు....మీ మేలు మరిచి పోలేను...." అంటూ విమలని దీవిస్తూ, పరుగు లాంటి నడకతో గేటు దాటాడు రాములు.

డాక్టర్ శేఖరుకి ఫోన్ చేసి అలాగే కూర్చుండి పోయింది విమల.

ఆ క్షణంలో ఆమెకు సుశీల గుర్తుకి వచ్చింది. సుశీల జీవితం ఓ సమస్యల పుట్ట! ఆమె బ్రతుకు ఓ వలలో చిక్కుకుందని తాను ఎన్నో సలహాలు ఇచ్చింది. 'నీకు ఉద్యోగం వుంది, హాయిగా వుండచ్చు. కావలిస్తే ఆ భర్తని కాదని వేరే వుండు. నీవు కావలిస్తే అతనే వస్తాడు' అని కూడా తాను సలహాలిచ్చింది.

కాని తాను ఏం వదిలించుకోగలుగుతోంది? భర్తతో ఏ ఒక్క సరదా తీరటం లేదని బాధ పడుతోంది. అతన్ని రోజుకి ఒకసారైనా నింది స్తోంది. అతన్ని ఒక తాగుబోతుగా చూడలేక వేదన అనుభవిస్తోంది. అయినా ఆ బంధం తెంచుకోలేకపోతోందేం?

తనకి చదువుంది. ఉద్యోగం లేకపోవటమన్నది ఒక సమస్య కాదు. అయినా ఇంకా ఎందుకు ఈ బంధనాల నుంచి బయట పడలేకపోవటం? సుశీలకి సలహాలిచ్చినంత తేలిగ్గా తన సమస్యల్ని ఎందుకు పరిష్కరించుకోలేక పోతోంది? అలసటగా కళ్ళు మూసుకుంది విమల.

మనో నేత్రం ముందు నగ్న సత్యం ఒకటి ఆమెకి గోచరించింది.

"ఒక సన్నటి పెద్ద వల! అందులో ఎన్నో రకాల చేపలు బయట పడనూ లేక లోపల ఇమడనూ లేక గిజగిజా తన్నుకుంటున్నాయి!"

దీర్ఘంగా నిట్టూర్చింది విమల. జీవితమే ఒక పెద్ద 'వల' లాగ అన్పించిందామె మనసుకి!

బంధనాలలో చిక్కుకున్న మనిషిలా వలలో చిక్కుకున్న ప్రాణి తప్పించుకోలేదు!

నెమ్మదిగా లేచి భర్త మంచం వైపు నడిచింది విమల. *

గేయం:

## ఆవేదన

ఎలా వ్రాయాలి?
ఇది వనిత జీవితమని!

తరతరాలుగా
పురుషుని చేతి కీలుబొమ్మగా
అతని విలాసాలకు ఆటబొమ్మగా
దురాచారాల ఇనుప చక్రాల్లో
మూఢ నమ్మకాల కర్కశ దంతాల కింద
నలిగి, నలిగి అలసిపోయి
తనకంటూ ఒక అభిప్రాయం,
ఒక వ్యక్తిత్వం వుండాలని
మరచిపోయిన మహిళ గురించి
ఏమని వ్రాయాలి?

ప్రకృతి సిద్ధంగా సమానురాలైన స్త్రీని—
ఆమె సహనాన్ని ఆసరా చేసుకొని
వంట ఇంటికి, మంచం కోటికి
అంకితం చేసి
ఆమెలోని ప్రజ్ఞకు, ఆమె కోరికలకు
ఘోషా అనే ముసుగు వేసి
ఆమె ఆశలను, ఆశయాలను
ఆదిలోనే సమాధి చేసి
ఆమెలోని చైతన్యాన్ని అదిమిపెట్టి
అబలగా చిత్రీకరించినప్పుడు
ఏమని వ్రాయాలి?—

స్త్రీ కూడా మనిషేనని గుర్తించి
స్త్రీ పురోగమనమే, జాతి పురోగమనమని
గమనించి గౌరవించేదాక
ఏమని వ్రాయాలి?
నేనేమని వ్రాయాలి??

—తాడి మహలక్ష్మి